# సంపాదకీయం



మిమ్ము అనాథులుగా వదలను. మీకొక ఆదరణకర్తను పంపుతాను. లోకాంతము వరకు సర్వదా మీతో ఉంటాను అని యేసు పలికిన మాటలు నిజమైనాయి. అసలు దేవుని వాగ్ధానంలో ఎటువంటి పొరపాటులేదు. సృష్టి ఆరంభం నుండి ఆయన వాగ్ధానాలన్నీ నెరవేరాయి, నెరవేరుతున్నాయి. ఆయన ఆలోచనలో ఎటువంటి మార్పులేదు. యేసు వాగ్ధానం చేసిన ప్రకారమే పెంతెకోస్తు పండుగనాడు పవిత్రాత్మ దేవుడు అగ్నిజ్వాలల రూపంలో అపోస్తులులపై దిగి వచ్చాడు. భయంతో, ఆందోళనతో నిండిన వారి బ్రతుకులలో ధైర్యం నింపాడు. ఒక ప్రక్క తమ నాయకుడు, తమ సర్వస్వం అని భావించిన యేసును కోల్పోయి, ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితులలో వారికి దిశను చూపించాడు.

మీరు ప్రపంచమంతట తిరిగి సర్వజాతి జనులకు సువార్తను బోధింపుడు అని యేసు ఇచ్చిన ఆజ్ఞను ఆత్మ దేవుని అనుగ్రహంతో అన్యభాషలను మాట్లాడే శక్తిని పొంది, ఉరకలు వేసే ఉత్సాహంతో ఎదురులేని ధైర్యంతో, దైవరాజ్య విస్తరణకు కంకణం కట్టారు. క్రీస్తు లేని జీవితం వ్యర్థమని, సువార్తను బోధించుటయే తమ కర్తవ్యమని, హింసలను సైతం లెక్కచేయక పవిత్రాత్మ దేవుని శక్తితో ముందుకు వెళ్ళారు. ఆ విధంగా సువార్తరథం ఉరకలువేస్తూ పల్లెపల్లెకు, వాడవాడకు చేరింది. విశ్వాసుల సంఖ్య పెరిగింది.

మోక్షారోహణమైన క్రీస్తును దేవదూతల బృందము అడిగిందట: నీవు ప్రారంభించిన రక్షణ కార్యాన్ని ఎవరుకొనసాగిస్తారని. అందుకు బదులుగా క్రీస్తు నా స్నేహితులు ఉన్నారని సమాధాన మిచ్చారట. ఆయన స్నేహితులం మనమే.

ఈనాడు ఈ సువార్తా రథ సారథులుగా మనం ఉన్నాం! ఆత్మదేవుని నడిపింపు లేనిదే అడుగు ముందుకు వేయలేం. అందుకే పునీత పౌలు అంటారు, "ఆత్మ ప్రేరణ అనుసరించి అన్ని సమయములందు, విజ్ఞాపములతో ప్రార్థింపుడు." (ఎఫెసి 6:18).

ఈ కార్యసాధనలో ఎన్నో హింసలు, కష్టాలు ఎదురౌతాయి. పునీత పౌలు చెప్పినట్లు "మన విశ్వాసమునకు కారకుడు, పరిపూర్ణతలను ఒసగువాడైన ఆయేసుపై మన దృష్టిని నిలుపుదము" (హెబ్రి 12:2). విశ్వాసం కోల్పోకుండా మన దృష్టిని ఆ యేసుపై ఉంచి అడుగు ముందుకు వేద్దాం!

ఎందుకంటే మనకు సాధారణము కాని ఏ శోధన మనకు కలుగదు. మన దేవుడు నమ్మదగినవాడు. మన నిగ్రహాశక్తిని మించి మనలను శోధింపడు. (1 కొరింతి 10:13)

కాబట్టి ప్రభువు సాన్నిధ్యం, పవిత్రాత్మ సహకారం మనకు తోడు ఉన్నంత వరకు ఏ శక్తి మనలను జయించలేదు. చివరకు మరణం కూడా మనలను క్రీస్తు ప్రేమనుండి వేరుచేయలేరు.

ప్రియస్నేహితులారా! సువార్తను ప్రకటించడం మన ధర్మం, బాధ్యతగా స్వీకరించి అలుపెరుగక, అకుంఠిత దీ క్షతో ముందుకు సాగిపోతూ, మన రక్షకుడైన క్రీస్తు నామమునకు గౌరవమును చేకూర్చుదాం! (ఫిలిప్పి 1:20). ప్రేమ, నీతి, న్యాయం అనే దైవరాజ్య నిర్మాణంలో భాగస్తులవుదాం!

**ఫా. దామాల విజయ కుమార్**

**ఎడిటర్**

# పెంతెకోస్తు మహోత్సవం

## 04-06-2017

***అ.చ. 2:1-11 1కొరింతీ 12:3-7 యోహాను 20:19-23***

అగ్ని దేనిని స్పృశిస్తే అది రూపాంతరం చెందుతుంది. పవిత్రాత్మ ప్రభువు జ్ఞానస్నాన గడియలో మనపైకి ప్రేమాగ్ని జ్వాలగా దిగివస్తారు, మనలను స్పృశిస్తారు, మనలను స్వస్థపరుస్తారు, మనలను ప్రేమజ్యోతులుగా రూపాంతరం కావిస్తారు. అంతేగాదు మనకు అమూల్యమైన తన సప్తవరాలను ప్రసాదిస్తూ మనల్ని శక్తిమంతులుగా చేస్తారు, పరస్పరం మనం, సేవాసహకారాలను అందజేసుకుంటూ ప్రభువు మనకిచ్చిన "సోదరప్రేమాజ్ఞ"ను తూచా తప్పక పాటించడానికి చేయూతనిస్తారు. ఇలా ప్రభువుకు నమ్మకపాత్రులమైన శిష్యులముగా ఆయన ఆజ్ఞలను ఆదేశాలను పాటిస్తోన్న మన ద్వారానే శాంతీ సంఘీభావాలు వర్ధిల్లే దేవుని రాజ్యాన్ని నిర్మిస్తూ ఉంటారు. "పెంతెకోస్తు" నాడు ఆరంభమైన ఈ దైవరాజ్య నిర్మాణాన్ని నిర్విఘ్నంగా కొనసాగించేవారు, సంపూర్ణం కావించేవారు పవిత్రాత్మ ప్రభువే. అవును. పవిత్రాత్మ ప్రభువే దైవరాజ్య శిల్పి!

### మొదటి పఠనం : అ.చ. 2:1-11

"పెంతెకోస్తు" నిజానికి కోతలకాలంలో జరుపుకొనే పండుగ. అయితే క్రమక్రమంగా పూర్వనిబంధనకాలంలో మోషే సీనాయి పర్వతం మీద దేవుని చట్టాన్ని (పది ఆజ్ఞలను) అందుకొన్న, సంఘటనను, ఇస్రాయేలీయులు దైవప్రజలుగా మారిన చారిత్రక ఘట్టాన్నీ స్మరించుకుంటూ జరుపుకొనే మతపరమైన మహోత్సవంగా రూపుదిద్దుకుంది. కనుకనే "పెంతెకోస్తు" నాడు దేశ విదేశాల్లోని యూదులంతా యెరుషలేముకు చేరుకొని అర్చనా సాంగ్యాల్లో పాల్గొనడం ఆనవాయితీ.

గనకనే పవిత్రాత్మ అపోస్తలులపై వేంచేసిన పెంతెకోస్తునాడు కూడా వివిధ దేశాలనుంచి వచ్చిన యూదులు వేలాదిమంది యెరుషలేములో ఉండటం సంభవించింది!

ఈ పండుగనాడే "ఒకచోట కూడియున్న" మరియమాతపైన, అపోస్తలులపైన, ఇతర శిష్యుల పైన (అ.చ. 1:15) పవిత్రాత్మ ప్రభువు అగ్ని నాలుకల రూపంలో వచ్చి

నిలిచారు. ఆ విధంగా ప్రాచీన ఇస్రాయేలు ధర్మచట్టాన్ని అందుకున్న రోజుననే, నూతన ఇస్రాయేలు (శ్రీసభ) పవిత్రాత్మను స్వీకరించింది; ధర్మచట్టానికి ప్రత్యామ్నాయంగా అవతరించింది.

పవిత్రాత్మ ఆగమన ఘట్టంలో మనకు కనిపించే నిగూఢమైన సంకేతాలేమిటో వాటి అంతరార్థాలేమిటో పరిశీలిద్దాం.

**మొదటిది:** "వేగముగా వీచు బలమైన గాలి". ఇది ఆదామును సృష్టించే ఘట్టంలో దేవుడు ఊదిన శ్వాసకు సంకేతం. నాడు దేవుడు ఊదిన శ్వాస ఆదాము సృష్టికి కారణమైనట్లే (ఆది 2:7) పవిత్రాత్మ ఆగమన వేళ వీస్తోన్న ఈ బలమైన గాలి అక్కడ కూడియున్న విశ్వాసులలో ప్రతి ఒక్కరినీ "నూతన వ్యక్తులు" గా మార్చే "ప్రతిసృష్టి" కి సంకేతంగా నిలుస్తుంది ఈ "బలమైన గాలి" నూతన సృష్టికీ, నవయుగానికీ స్వాగతం చెబుతుంది.

**రెండవది:** "అగ్నినాలుకలు". ఈ మాట ముందుగా మనకు "నేను భూమిమీద నిప్పు అంటించుటకు వచ్చియున్నాను" (లూకా 12:49) అంటూ యేసుప్రభువు పలికిన మాటను గుర్తు చేస్తుంది. అలాగే క్రీస్తు యేసు ద్వారా దేవుడు చేసిన మహత్కార్యాలను ఇకపై విశ్వాసులు బహిరంగంగా ప్రకటిస్తారనీ, నిర్భయంగా దేవుని స్తుతించబోతున్నారనీ ఈ "అగ్నినాలుకలు" ప్రతీకాత్మకంగా ప్రకటిస్తున్నాయి.

**మూడవది:** పెంతెకోస్తునాడు యెరుషలేమునకు "భూలోకములోని ప్రతి దేశమునుండి వచ్చిన దైవభక్తులగు యూదులు". నాడు బాబెలు గోపురం వద్ద భాషలు తారుమారై "నేల నాలుగువైపులకు" చెదిరిపోయిన మానవులను గుర్తుకు తెస్తారు (ఆది 11:1-9). బాబెలు గోపురం వద్ద దేవుడు తన సంకల్పాన్ని లెక్కచేయని (తమ ఇచ్ఛానుసారం జీవిస్తోన్న) మానవులను చెల్లాచెదురు చేయడానికి వారి భాషలను తారుమారు చేశారు. కానీ పవిత్రాత్మ దిగివచ్చిన ఈ పెంతెకోస్తునాడు ఎవరు ఏ భాషల్లో మాట్లాడినా అన్ని భాషలవారు అర్థం చేసుకోగలిగారు. నాడు తారుమారైన భాషలు, నేడు మానవుల పునరేకీకరణకు సాధనాలయ్యాయి. తాము పోగొట్టుకున్న సామర్థ్యాన్ని తిరిగిపొందగలిగాయి. ఈ పరిణామం దైవసందేశాన్ని దేవుని సంకల్పాన్ని మానవులందరు అర్థం చేసుకోవడానికీ భాషా భేధాలకు అతీతంగా అందరూ దైవవిధేయులుగా జీవించడానికి దోహదం చేసింది.

దీనిని బట్టి పవిత్రాత్మ అద్భుతమైన సంధానకర్త అనీ, అపురూపమైన ఏకతా సాధకులనీ, మానవులమధ్యగల భిన్నత్వాన్ని గౌరవిస్తూనే ఏకత్వాన్ని ఆధించడం పవిత్రాత్మ అనుగ్రహంతోనే సాధ్యమవుతుందని మనం గ్రహించగలుగుతాం. గనుకనే ఆత్మపూరితమైన క్రైస్తవ సంఘంలో విశ్వాసులమధ్య సదా సౌహార్థం సంఘీభావం వర్ధిల్లుతూ ఉంటాయి. అలాంటి ఆదర్శక్రైస్తవ సంఘాలే దైవరాజ్య విలువలను నిష్ఠగా పాటించగలుగుతాయి, దైవరాజ్యాన్ని నిర్మించడంలో సఫలమవుతాయి.

## రెండవ పఠనం: 1కొరింతీ 12:3-7

పునీత పౌలు క్రీస్తు శకం 51/52 ప్రాతంలో కొరింతు పట్టణంలో క్రైస్తవ సంఘాన్ని స్థాపించాడు. ఇది ఎంతో చైతన్యవంతమైన క్రైస్తవ సంఘం. అయితే విశ్వాసుల మధ్య పొడచూపిన వేర్పాటు ధోరణులు, అంతఃకలహాల వల్ల అనేక సమస్యలు తలెత్తాయి. ఈ వైషమ్యాలకు ఒక కారణం "పవిత్రాత్మ వరాల" పట్ల సదవగాహన లేకపోవడం, ఆత్మవరాలను కూడా స్వార్జితమైన ఆస్తులుగా భావించడం, మిడిసిపడడం, సాటివారిపట్ల ఆధిక్యాన్ని ప్రదర్శించడం మొదలైనవి కొరింతు క్రైస్తవ సంఘంలో చిచ్చు పెట్టాయి. ఉదాహరణకు పవిత్రాత్మ నుంచి వివిధములగు భాషలలో మాట్లాడగల శక్తిని పొందినవారు తాము సంఘంలో అందరికంటే అధికులమని అహంకరిస్తూ ఉండేవారు, తమ గొప్పతనాన్ని అందరూ గుర్తించి గౌరవించాలని ఆరాటపడేవారు, పవిత్రాత్మ ప్రసాదించిన వరాలను స్వార్ధప్రయోజనాలకు వినియోగించుకుంటూ లౌకికమైన లబ్ధిని పొందజూచేవారు. బాధాకరమైన ఈ నేపథ్యంలో పౌలు కొరింతీయులకు ప్రధానంగా రెండు విషయాలను స్పష్టం చేస్తున్నాడు.

**మొదటిది:** ఒక వ్యక్తిని జ్ఞానస్నాన దివ్యసంస్కారం ద్వారా "తండ్రీ కుమారుల" సాన్నిధ్యానికీ, సహవాసానికీ చేర్చేవారు పవిత్రాత్మ. జ్ఞానస్నానం పొందిన విశ్వాసులందరినీ "క్రీస్తు దేహం" లో అవయవాలుగా చేర్చి, వారి మధ్య ఏకీభావాన్ని సఖ్యతా సామరస్యాలను పెంపొందించేవారు పవిత్రాత్మ. ముందుగా ఈ సత్యాన్ని కొరింతీయులందరు గ్రహించాలని కోరుతున్నాడు పౌలు.

**రెండవది:** కొరింతు క్రైస్తవ సంఘంలో తలెత్తిన ముఠాతగవులను పౌలు తీవ్రంగా ఖండించాడు. ముఖ్యంగా పవిత్రాత్మ వరాలను దుర్వినియోగం చేస్తూ విశ్వాసుల మధ్యగల

సఖ్యతను ఏకతాభావాన్ని విచ్ఛిన్నం చేయచూచే వారిని తీవ్రస్వరంతో మందలించాడు. నిజానికి పవిత్రాత్మ ప్రసాదించే వరాలన్నీ అమైల్యమైనవే, అన్నీ సమానమే. వాటిల్లో హెచ్చుతగ్గులుండవు ఎందుకంటే వానిని ఒసగు ఆత్మ ఒక్కడే (12:4). ఒకే పవిత్రాత్మ అనేకులైన విశ్వాసులకు అనేక వరాలను ప్రసాదిస్తున్నారు. అయితే పవిత్రాత్మ ప్రసాదించే ఈ వరాలు ఆయా వ్యక్తుల స్వార్థప్రయోజనాల కోసమో, వ్యక్తిగత కీర్తిప్రతిష్టలకోసమో లౌకికమైన లబ్దికోసమో ఇచ్చినవికావు. పవిత్రాత్మ ప్రసాదించే వరాలన్నీ శ్రీసభ సేవకు వినియోగించవలసినవి, క్రైస్తవ సంఘం వికాసం కోసం వినియోగించవలసినవి. ఇలా హితవు చెబుతూ పౌలు, గాడితప్పిన కొరింతు సంఘాన్ని తిరిగి దారికి తేగలిగాడు.

చివరిగా మానవులమధ్య ఏకైక సంధానకర్త, ఏకతా సాధకులు పవిత్రాత్మ ప్రభువేనన్న సత్యాన్ని పౌలు పునరుద్ఘాటించాడు.

## సువార్తా పఠనం: యోహాను 20:19-23

పునరుత్థానుడైన యేసుప్రభువు తన శిష్యులకు దర్శనమిచ్చిన ప్రతీసారీ వారికి పవిత్రాత్మవరాన్ని ప్రసాదించేవారు, ఆత్మ ద్వారానే దైవరాజ్య విశేషాలను వారికి ఉపదేశించే వారు (అ.చ. 1:2). తన పునరుత్థానం తరువాత యేసుప్రభువు పదిమంది అపోస్తులులకు దర్శనమిచ్చిన "తొలి దర్శనం" గురించి మన మీనాటి సువార్తా పఠనంలో చదువుతున్నాం. ఈ సంఘటనలో మనం గమనించవలసిన విశేషాలు అనేకం ఉన్నాయి.

**మొదటిది:** ఈ దర్శనం వారంలో మొదటి రోజున (ఆదివారం) సంభవిస్తుంది. ఈ "మొదటి రోజు" పునరుత్థానుడైన యేసు తాను పొందిన నిత్యజీవంతో "నూతన సృష్టి" చేయడానికి పూనుకున్నారన్న సత్యాన్ని సూచిస్తుంది. తన పునరుత్థాన గడియలోనే యేసుప్రభువు నిత్యజీవ భాగ్యాన్ని పొందగలిగారు. అలా నిత్యజీవం ప్రాప్తించిన మానవుడుగానే ప్రభువు యావత్ సృష్టినీ నిత్యజీవావరణంలోనికి ఆహ్వానిస్తున్నారు. అయితే పిత, పుత్ర, పవిత్రాత్మ, త్రియేక దేవునితో సన్నిహిత సంబంధం గలవారికే ఈ నిత్య జీవ భాగ్యం లభిస్తుంది.

**రెండవది:** "మీకు శాంతి కలుగునుగాక!" (20:19) అంటూ ప్రభువు పలికిన శాంతి వచనంతో గతంలో ఆయన తన శిష్యులకు చేసిన వాగ్దానం నెరవేరింది. తన శ్రమల

ఘట్టానికి ముందు ప్రభువు "శాంతిని మీకు అనుగ్రహించుచున్నాను, నా శాంతిని మీకు ఇచ్చుచున్నాను" (యోహాను 14:27), "అపుడు మీరు సంతోషింతురు, మీ సంతోషమును మీ నుండి ఎవడును తీసివేయడు" (యోహాను 16:22) అంటూ తన శిష్యులకు శాంతీ సంతోషాలను వాగ్దానం చేశారు ఈ రోజు ఈ శాంతి వచనం ద్వారా వారికావరాలను అనుగ్రహిస్తున్నారు.

**మూడవది:** ఈ దర్శనంలోనే పునరుత్థానుడైన యేసు పరుల పాపములను మన్నించుటకుగాను తన శిష్యులకు పవిత్రాత్మను ప్రసాదించారు. దీనిద్వారా "పాపపరిహారమునకై, నా ఆత్మను మీలో నుంచెదను" అంటూ తన తండ్రి భగవానుడు చేసిన వాగ్దానాన్ని కూడా ప్రభువు నెరవేర్చగలిగారు (యెహెజ్కే 36:25-27, అ.చ. 2:33).

కనుక "మీకు శాంతి కలుగును గాక!" అంటూ ప్రభువు పలికిన వందన వచనం, సామాన్య యూదులు పరస్పరం పలకరింపుగా చెప్పుకొనే "షాలోమ్ (శాంతి)" వంటిది కాదు. ప్రభువు ఈ మాటను రెండుమార్లు పలకడంలోనే (20:19,21) దీని ప్రాధాన్యం, నిగూఢతత్త్వం వెల్లడవుతున్నాయి.

**నాల్గవది:** ఈ తొలి దర్శనంలోనే పునరుత్థానుడైన ప్రభువు పాపమన్నింపు కోసం ప్రత్యేకమైన అపోస్తోలిక ధర్మాన్ని నెలకొల్పారు. ఆ మేరకు అపోస్తలులను సాధికారికంగా ఆదేశించారు. మరోమాటలో చెప్పాలంటే పునరుత్థానుడైన ప్రభువు "సఖ్యతాసంస్కారాన్ని" (పాపసంకీర్తన సంస్కారాన్ని) స్థాపించారు, దీనినే ఆనాడు "పాపక్షమాపణా సంస్కారం" గా భావించేవారు (యాకోబు 5:15).

అంతేకాదు పూర్వనిబంధన కాలంలో పలానావారు 'శుద్ధులు" లేదా "అశుద్ధులు" అని ప్రకటించే అధికారం యూద మతగురువులకు ఉన్నట్లే పునరుత్థానుడైన యేసు ప్రభువు పరుల పాపాలను మన్నించడానికి, మన్నించకపోవడానికి అవసరమైన దివ్యాధికారాన్ని తన అపోస్తలులకు ఇచ్చారు. గనకనే "పాపక్షమాపణము" ను ప్రకటించడం, పశ్చాత్తాప వరాన్నీ పాప క్షమావరాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నవారికి ఆయా కృపావరాలను ప్రసాదించడం శ్రీసభ ప్రధాన ధర్మాలలో అంతర్భాగాలయ్యాయి. (లూకా 24:47)

## ముగింపు:

పవిత్రాత్మ ఆగమనంతో తన కుమారుడు యేసుక్రీస్తు ప్రభువు ద్వారా తండ్రి దేవుడు తలపెట్టిన లోకరక్షాకార్యం సంపూర్ణమైంది.

అప్పటివరకు ప్రాణభయంతో అజ్ఞాతంలో కాలం గడిపిన అపోస్తలులు పవిత్రాత్మ పూరితులయ్యాక శక్తిమంతులయ్యారు, చైతన్యవంతులయ్యారు, బహిరంగంగా ప్రజల మధ్యకు వచ్చి సువార్తా ప్రబోధం చేయగలిగారు. ప్రభు సాక్షులుగా జీవించగలిగారు. అంతేకాదు క్రీస్తుప్రభువును విశ్వసించి జ్ఞానస్నానం స్వీకరించిన వారికి పవిత్రాత్మను ప్రసాదించగల అధికారాన్ని పొందారు.

మామూలు వ్యక్తిని "దేవుని కుమారుడు/దేవుని కొమార్తెగా" పరివర్తనం కావించగల శక్తి పవిత్రాత్మకు ఉంది. అయితే ఆత్మపూరితుడైన వ్యక్తి అందుకు సహకరించాలి, పవిత్రాత్మ ప్రేరణ కనుగుణంగా తన ఆలోచనలను, తన నడవడిని దిద్దుకోవడానికి సిద్ధంగా ఉండాలి, సంపూర్ణంగా "ఆత్మవశుడైన వ్యక్తి" గా జీవించాలి.

పవిత్రాత్మ మానవ హృదయంలో నాటబడిన దివ్యబీజం వంటిది. ఆయా వ్యక్తుల సహకారాన్ని బట్టి అది మొలకెత్తుతుంది, మొగ్గ తొడుగుతుంది, క్రమ క్రమంగా సప్తవరాలతో కూడిన సప్త శాఖల దివ్యవృక్షమై ఎదుగుతుంది, ఆయా వ్యక్తులను దేవుని సంతానంగా మలుస్తుంది, అపురూపమైన ఆత్మఫలాలను వారిద్వారా శ్రీసభకూ ప్రపంచానికీ అందజేస్తుంది!

# త్రిత్వైక సర్వేశ్వరుని మహోత్సవం
## 11-06- 2017

రెవ. ఫా. బుర్రి జాన్ పీటర్, రోమ్‌నగరం, ఇటలీ

ప్రస్థాన 34:4-6;8-9 2కొరింతి 13:11-13 యోహాను 3:16-18

త్రిత్వైక సర్వేశ్వరుని యందు విశ్వాసముంచుట క్రైస్తవులకు ప్రధానమైన విశ్వాస సత్యాలలో ప్రధమమైనది. మన ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఈ త్రిత్వైక సర్వేశ్వరుని నామముతోనే మొదలుపెడతాము. ఉదయము లేవటముతోనే ఏదైనా పని మొదటుపెట్టే ముందు, దివ్యపూజలో, ప్రతి దివ్యసంస్కార మొదలులో త్రిత్వైక సర్వేశ్వరుని నామముతో మొదలు పెట్టడం మన విశ్వాసం, నమ్మకము. ప్రతి దీవెన, ఆశీర్వాదం త్రిత్వైక సర్వేశ్వరుని నాముచ్చరణతోనే ఉండడం గమనార్హం.

### పిత, పుత్ర, పవిత్రాత్మ

**మనిషి సృష్టి ఆరంభంలో మహిలో నిలచిన తండ్రి దేవుడు**

**దివిలో మనిషిని భాగస్తునిచేయ భువిలో నిలచిన యేసు దేవుడు**

**భువిలో మానవ మనుగడకు జీవం పోస్తున్న పవిత్రాత్మ దేవుడు**

ఈ ముగ్గురు ముగ్గురు దేవుళ్ళా లేక ఒకే దేవుడా? ఇది సత్యోపదేశ ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు "ఒకే దేవుడు" అని మనమంతా ఎకకంఠంతో సమాధానమిస్తాం. ఇది మన విశ్వాసం. దీనిలోని కొన్ని లోతైన భావాలను తెలుసుకోవటానికి ప్రయత్నిద్దాం.

### చరిత్ర

శ్రీసభ, ఆరంభమునుండి తాను నమ్మిన, బోధిస్తున్న విశ్వాస సత్యాలలో ఎన్నో ఆటుపోటులను ఇప్పటివరకూ అనుభవవిస్తూనే ఉంది. వానిలో భాగమే త్రిత్వైక సర్వేశ్వరుని రహస్య సత్యము. మానవ మేధస్సుకు అందనటువంటిది. అర్ధం కానటువంటి సత్యం. పునీత తోమాస్ అక్వినాస్ గారు అన్నట్లుగా, విశ్వాసంతో మాత్రమే మనం అర్ధం చేసుకోగలం. దేవుని లోతైన జీవితంతో మాత్రమే ఈ సత్యాలను అర్ధం చేసుకోగలం. శ్రీసభ మొదటిలో ఏకత్రిత్వ సర్వేశ్వరుడు అనే విశ్వాస సత్యాన్ని ఎంతో మంది వ్యతిరేకించారు. అందులో ముఖ్యంగా (యెహోవా సాక్షులు) తండ్రి ఒక్కడే దేవుడు అని నమ్మేవారు. మరియు "యేసు ఒక్కడే" అని నమ్మేవారు. ఈ విధంగా వివిధ రకాల ఆలోచనలలో ఉంటున్న పెంతెకోస్తువారు, మరియు ఎన్నో శాఖలవారు ఏదోఒక విధంగా భంగం కలిగిస్తున్నారు. మరీ ముఖ్యంగా 250-336 ఎ.డి లో ఆర్వేనిజం ఒకే బృందం

వారు, మనుష్యావతారమెత్తిన యేసు తండ్రి దేవునితో సమానత్వం కలిగివుండలేదు అని వారించటం మొదటుపెట్టారు. ఈ వాదనను తరువాత కాలంలో ఉన్న వేదపండితులు, పీఠాధిపతులు ఎదుర్కొని అంతమొందించారు. ప్రస్తుత కాలంలో ఎన్నో శాఖల వారు ఈ త్రిత్వైక సర్వేశ్వరుని నామంతో, ప్రార్థనలు, పూజలు, ఆశీర్వాదాలు, స్తుతులు చేయుట మన ధృఢమైన విశ్వాసానికి తార్కాణం.

## పరిశుద్ధ గ్రంథ ఆదారంతో

మొదట సాక్ష్యం పరిశుద్ధ గ్రంథం ఆధారంగా త్రిత్వైక సర్వేశ్వరుని రహస్య ప్రణాళికను అర్థం చేసుకోటానికి ఉన్నది. ఆదికాండంలో అబ్రహాముతో మెమ్రే దగ్గర ముగ్గురు దైవ స్వరూపులు ముచ్చటించటం (ఆది 18:1) వేదశాస్త్రవేత్తలు ఏకత్రిత్వ సర్వేశ్వరునికి ఇచ్చు మొదటి ప్రాథమిక సాక్ష్యం ఇది. వేదాంత పరంగా మానవ రక్షణ ప్రణాళిక అబ్రహాముతో (ఎన్నికతో) మొదలైంది. అందుకే ముందుగనే మహాగొప్ప సత్యాన్ని దేవుడు అబ్రహాముకు విశధపరుస్తున్నాడు. పాతనిబంధన గ్రంథంలో అనేకచోట్ల దేవుడు తన ప్రజలను తనవైపు త్రిప్పుకొనుటకు అనేకమైన పద్ధతుల ద్వారా ప్రవక్తల ప్రవచనాల ద్వారా దేవుని ప్రేమను, మహాసత్యాలను విశధపరచటం మనం చదువుతాం. అనేక చోట్ల ప్రవచనాల ద్వారా తన కుమారుడైన యేసుక్రీస్తు యొక్క రాకడ మరియు ఆత్మ దేవుని యొక్క నడిపింపును మనం పవిత్రగ్రంథంలో కూడా చూడవచ్చు. తండ్రి దేవుడు తన ప్రజలను నడిపించిన తీరు మరియు వారికి దేవుని ప్రేమను నేర్పించిన తీరు నేను మాత్రమే మీ దేవుడను, మీరు నా ప్రజలు అన్న మాటల్లో భవిష్యత్తులో మిమ్ములను రక్షించే నా కుమారుడు, నడిపించే పరిశుద్ధాత్మ కూడా ఉన్నారు అన్న సత్యాన్ని మనం మరువకూడదు. నూతన నిబంధనలో అనేకచోట్ల త్రిత్వైక సర్వేశ్వరుని సాక్ష్యం మనకు కనిపిస్తుంది. మొదటిగా (మత్తయి 28:19) పునరుత్థాన ప్రభుని ఆజ్ఞ స్వయంగా క్రీస్తువే పలికిన మాట. పిత, పుత్ర, పవిత్రాత్మ (అ.పో. 2:38,8:12,19:5, రోమా 6:3, 1కొరింతి 1:13) లో మనం చూస్తాం. ప్రభుని ఆజ్ఞను పాటించిన తన అపోస్తులలును (2కొరింతి 12:4-6) లో పౌలు యొక్క మాటలు శ్రీసభ యొక్క ఒకే శక్తిని గురించి ప్రస్తావించటం మనం చూస్తున్నాం (ఎఫెసి 4:4-6)లో మనం చూస్తాం. ఒకే దేవుడు, ఒకే శరీరం, ఒకే ఆజ్ఞ, ఒకే జీవితం, ఒకే విశ్వాసం, ఒకే జ్ఞానస్నానం మరియు మనందరికి ఒకే తండ్రి. ప్రభువు పలికిన విధంగా నన్ను చూస్తే తండ్రిని చూచినట్లే, నేను నా తండ్రి వేరువేరుకాదు, ఒక్కరే, మేమిద్దరం కలిసి మీకు తోడుగాఉంటే మమ్ము ఓదార్చే ఆత్మను పంపుతాం అని వాగ్ధానం చేసిన ప్రభుని మాటలమీద విశ్వాసంతో

ఏకత్రీత్వ సర్వేశ్వరుని యందు విశ్వాసం ఉంచాలి.

**2 కొరింతి 13:14:**

త్రిత్వైక సర్వేశ్వరుని మహిమను పౌలుగారు మనకు వివరిస్తున్నారు. శ్రీసభ తన అమూల్యమైన దివ్యపూజలో ప్రధమంగా వినియోగించేది, మరియు పౌలుగారు పలికినట్లు దేవుడు అందరిలా అన్నీ తానైయున్నాడు (1కొరింతి 15:8) ఇన్ని అధారాలు మనకు ఉన్నా ఇంకా ఏకత్రీత్వ దేవుని రహస్యాన్ని మన మేధస్సులో అర్ధంచేసుకోటం అంతసులభతరం కాదు. పునీత అగుస్తీనుగారు తన జీవితంలో త్రిత్వైక సర్వేశ్వరుని గురించి ఒక పుస్తకంలో పొందు పరుచటలో ఎదుర్కొన్న సన్నివేశం మనందరికి తెలిసినదే. సముద్రాన్ని చిన్న గుంటలో నింపాలి అన్న చిన్నపిల్లవాడి ప్రయత్నం వలే, మహాశక్తిగల దేవుని మహిమను అర్ధంచేసుకోవటం వంటిది. విశ్వాసంతో, మనం నమ్మిన సిద్ధాంతాలతో ముందుకు సాగాలి.

## ప్రేమను పంచు త్రియేక దేవుడు

ఈనాటి మొదటి పఠనం మోషేకు దేవుడు విశధపరచిన దైవప్రేమను మనం విన్నాం. ప్రభువు కరుణామయుడు, సహనపరుడైన దేవుడు, సులభముగా కోపపడువాడు కాదు, నిత్యము ప్రేమచూపువాడు, నమ్మదగినవాడు. ఇది దేవుని ప్రధానమైన లక్షణం. తన ప్రజల యెదుట ఇది కేవలం పాత నిబంధనలో పరిచయం అయిన తండ్రి దేవుని గురించి మాత్రమేకాదు, తన కుమారుడైన యేసు గురించి పరిశుద్ధాత్మ గురించి ఎందుకంటే వారు వేరుకాదు ఒకే దేవుడు కాబట్టి. మోషే ఈరోజు తన ప్రజలకోసం ప్రార్ధిస్తున్నాడు. ఈ ప్రజల "తలబిరుసుతనం" గురించి బహుశా మనంకూడా చాలాసార్లు ఇదే త్రోవలో ఉన్నామేమో ఆత్మపరిశీలన చేసుకోవాలి. మన విశ్వాస జీవిత యాత్రలో దివ్యబలిపూజ విషయంలో, దివ్యసంస్కారాల విషయంలో, మరియు మన విచారణ సంఘాలలో మన అశ్రద్ధ, దేవుడు లేని అంధకారమయం అవుతుంది. త్రియేక దేవుని వెలుగుతో నింపమని ప్రార్ధిద్దాం. ఎందుకంటే దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కనుకనే తన ఏకైక కుమారుని ఈ లోకమునకు వెలుగుగా పంపెను. అంధకారంలో ఉన్నవారికి మార్గమై జీవమై సత్యమై నడిపిస్తూ త్రియేక దేవుని మహిమలో పాలివారమవ్వుటకు దేవుడు తండ్రిగా, కుమారుడిగా (యేసుగా) పరిశుద్ధాత్మగా మనకు సహాయపడుతున్నారు.

తండ్రి దేవుని ప్రేమ, యేసు దేవుని మహిమ, పరిశుద్ధాత్మ సహవాసం మీకు తోడై ఉండునుగాక.

# దివ్యసత్ప్రసాద మహోత్సవం

## 18-06-2017

***ద్వితీయో 8:2-3, 14-16 1కొరింతీ 10:16-17 యోహాను 6:51-58***

"దివ్యసత్ప్రసాదం" ఒక దివ్యానుబంధం... ఒకవైపు మనలను క్రీస్తు ప్రభువుతోను, మరోవైపు సాటి మానవులతోను అనుసంధానించే అపురూపమైన అనురాగ బంధం!

"దివ్యసత్ప్రసాదం" మన ఆత్మలను పోషించే దివ్యాహారం తండ్రి సన్నిధిలో కుడిప్రక్కన ఆసీనుడైయున్న క్రీస్తుప్రభువు తండ్రి సాన్నిధ్యానికి సాగే ఈ ఐహిక జీవన యాత్రలో మనకు సత్తువనొసగేందుకు, సేదతీర్చేందుకు, ముందుకు నడిపేందుకు అనుగ్రహించే జీవాహారం, దివ్యౌషధం...దివ్యసత్ప్రసాదం!

"దివ్యసత్ప్రసాదం/దివ్యబలి సంస్కారం" దైవప్రజలకు ఆనవాలు. దివ్యబలిని సమర్పించడం, దివ్యసత్ప్రసాదాన్ని స్వీకరించడం మనం దైవ జన సంఘానికి చెందినవారమని తెలియజేస్తుంది. మనది ప్రేమ సౌజన్యాలు వర్ధిల్లే సౌహార్ధ సంఘమనీ, అపారమైన నిత్యజీవావరణంవైపు మొక్కవోని ఆశాభావంతో సాగిపోయే "విముక్త జనసంఘం"మనీ చాటి చెప్పేది "దివ్య సత్ప్రసాదం," మనలను ప్రభు సాక్షులుగా మలచేది "దివ్యసత్ప్రసాదం"!

## మొదటి పఠనం : ద్వితీయో 8:2-3,14-16

మోషే తన మరణానికి ముందు చెప్పిన మాటలు, చేసిన రచనల సంకలనమే ఈ "ద్వితీయోపదేశకాండం". అప్పటికింకా ఇస్రాయేలు ప్రజలు వాగ్దత్త భూమికి చేరుకోలేదన్నది స్పష్టం.

ఇక్కడ మోషే నలభై యేళ్ళపాటు కొనసాగిన ఎడారి ప్రయాణంలో తాము అనుభవించిన బాధలను, కష్టాలను, కడగండ్లను జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు. ఆకలి బాధ, దాహార్తి, పాములు తేళ్ళతో భయానకమైన సహజీవనం ఇలా ఎన్నో బాధలు..! కేవలం బాధలను ఏకరువు పెట్టడమే కాదు, తమను బాధల నుంచీ భయాలనుంచీ గట్టెకించడానికి ఎప్పటికప్పుడు దేవుడు చేసిన మహత్కార్యాలన్నింటినీ మోషే ఇస్రాయేలీయులందరికీ గుర్తు చేస్తున్నాడు. ముఖ్యంగా రాతి నుంచి నీటిని పుట్టించిన సంఘటనను, ఆకాశం నుండి మన్నా కురిపించిన ఘట్టాన్నీ ఉద్వేగంతో వర్ణించి చెప్పాడు మోషే.

దేవుడు ఇలా తన అద్భుత శక్తితో సమకూర్చిన జలవనరులు, మన్నా భోజనాల గురించి ప్రత్యేకంగా వివరిస్తూ మోషే ఈ ఘటనల నుంచి ఒక పాఠాన్ని నేర్చుకొమ్మని ఇశ్రాయేలీయులను కోరుతున్నాడు. అదేమిటంటే ఎల్లవేళలా "విశ్వాసం మీద ఆధారపడి ఉండడం....అంటే సదా దేవుని పైననే ఆధారపడి జీవించడం!... ఎడారి ప్రయాణ కాలంలో ఏవిధంగా దేవునిపై ఆధారపడి జీవించారో అదే రీతిగా, ఈ ప్రయాణం ముగిశాక కూడా వారిలాగే దేవుని అంటిపెట్టుకొని ఉండాలన్నదే మోషే కోరిక.

దేవుడు సర్వులకు సమస్తమును సమకూర్చగల సమర్థుడు. ప్రకృతి శక్తులు ప్రతికూలించినపుడు సైతం తనను నమ్మినవారి అవసరాలన్నిటినీ తీర్చగల సర్వశక్తిమంతుడు. అయితే ఇశ్రాయేలీయులు ఎల్లకాలమూ దేవుని నమ్ముతూనే ఉంటారా, తమ అవసరాలన్నిటికీ దేవుని పైననే ఆధారపడతారా లేదా అన్నదే అసలు ప్రశ్న.

నిజానికి ఇశ్రాయేలీయులకు దేవుని అండదండలు ఇప్పటికీ అవసరమే. వారు వాగ్దత్త భూమికి చేరాక కూడా వారు సంపూర్ణంగా స్వతంత్రులు కావాలంటే, అనేక విషయాల్లో వారు బానిసత్వపు బంధనాలను తెంచుకోవలసి ఉంటుంది. కనుకనే వారికి దేవుని సహాయం కావాలి, సదా వారు దేవుని పైననే ఆధారపడి ఉండాలి.

ఈ సందర్భంలోనే మోషే దేవుడు సమకూర్చిన మన్నా భోజనం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు, ఈ మన్నా భోజనం ద్వారానే అనుదినమూ తనపై ఆధారపడడమంటే ఏమిటో దేవుడు తమకు నేర్పించారని చెప్పాడు.

"మన్నా"కు గల భౌతిక లక్షణాలివి: ఇది రొట్టెలా కనిపిస్తుంది, తిన్న వారి ఆకలి తీర్చుతుంది.

"మన్నా"కు గల ఆంతరంగిక (ఆత్మీయ) లక్షణాలివి: దీనికి రుచి ఉండదు, వాసన ఉండదు, మర్నాడు సబ్బాతు దినమైతే తప్ప దీనిని నిల్వచేసుకొనే వీలుండదు.

మన్నా భోజనానికిగల ఈ లక్షణాల వలన మనకు రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. **ఒకటి:** ఈ మన్నా భోజనం విశ్వాసులకు దేవుడు వొసగిన ఆహారం, **రెండు:** ఈ మన్నా భోజనం దేవుని దివ్యశక్తికి నిదర్శనం అంతేకాదు యావత్ మానవ జాతికి నిత్యజీవాన్ని ప్రసాదించే ఆధ్యాత్మిక ఆహారాన్ని సమకూర్చాలనే దేవుని ప్రణాళికకు ఈ మన్నా భోజనం ఒక సంకేతం!

"ప్రజలు" తనపై ఆధారపడినంతకాలం

"ప్రభువు" వారికి సమస్తమును సమకూర్చుతారు!

## రెండవ పఠనం: 1కొరింతీ 10:16-17

పునీత పౌలు కొరింతు క్రైస్తవ సంఘాన్ని పట్టి పీడిస్తున్న అనైక్యతను తొలగించి సఖ్యతా సమైక్యతలను నెలకొల్పడానికి "దివ్యసత్ప్రసాదాన్ని (దివ్యబలిని)" శక్తిమంతమైన అనుసంధాన సాధనంగా భావించాడు. అప్పటికే కొరింతు సంఘంలో ఒక పక్క అంతః కలహాలు పేట్రేగుతూంటే, మరోపక్క అన్యజనులర్పించే జంతు బలులలో పాల్గొనే క్రైస్తవుల సంఖ్య పెచ్చు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పౌలు దివ్యసత్ప్రసాద ప్రాధాన్యతను వివరిస్తున్నాడు.

**మొదటిది:** దివ్యసత్ప్రసాదం (దివ్యబలి) విశ్వాసులు దేవునికి అర్పించే యథార్థబలి. ఈ దివ్యబలిలో మనం సమర్పించే రొట్టె రసాలను కాదు, సాక్షాత్తూ క్రీస్తు శరీర రక్తాలనే అర్పిస్తున్నాం అంటాడు పౌలు. ఆ విధంగా "దివ్యసత్ప్రసాదంలో (దివ్యబలిలో) క్రీస్తు ప్రభువు యథార్థంగా కొలువు దీరి ఉంటారన్న" మన నమ్మకాన్ని పౌలు మాటలు బలపరుస్తున్నాయి. గనకనే ప్రభు దివ్యబలిలో పాల్గొనే క్రైస్తవులెవరూ అన్యదేవరల బలులలో గానీ తాంత్రిక బలులలో గానీ పాల్గొనరాదు.

**రెండవది:** పౌలు ప్రబోధం ప్రకారం "దివ్యబలి (దివ్యత్ప్రసాదం)" ఏకతా సాధనమూ, సంకేతమూనైన దివ్యవిందు. కనుకనే క్రీస్తు శరీరమైన ఒకే రొట్టెను భుజించే క్రైస్తవులు క్రీస్తు ప్రభువుతో ఐక్యం కావడంతోపాటు సాటి విశ్వాసులందరితోను "ఏకతా శరీరు" లవుతారు.

నిజానికి అన్యదేవరల కిచ్చే బలులైనా, యూదులు అర్పించే బలులైనా, క్రైస్తవులర్పించే బలులైనా అన్ని బలులు భక్తులకూ భగవానుడికీ మధ్య సఖ్యతనూ సంఘీభావాన్నీ పెంపొందించడానికి ఉద్దేశించబడినవే. అయితే క్రైస్తవ దివ్యబలి (దివ్యసత్ప్రసాదం) ద్వారా విశ్వాసులకు క్రీస్తు ప్రభువుతో ఏర్పడే సఖ్యతా సంఘీభావాలు ప్రత్యేకమైనవి, విశిష్టమైనవి, క్రైస్తవేతరుల సంఘీభావం కంటే అన్ని విధాల ఉన్నతమైనవి.

## సువార్తా పఠనం: యోహాను 6:51-58

"జీవాహారం" గురించి యేసుక్రీస్తు చేసిన ప్రబోధంలోని ఒక భాగాన్ని మన మీనాటి సువార్తా పఠనంలో చదువుతున్నాం. పాస్కా పండుగ సందర్భంగా యెరూషలేములో పర్యటిస్తోన్న సందర్భంలో యేసు ఈ ప్రబోధం చేశారు.

ఈ పఠనంలో ప్రధాన సందేశం దివ్యసత్ప్రసాదం. ఈ దివ్యసత్ప్రసాదంలో కొలువుదీరి ఉన్న యేసుప్రభువే నిత్యజీవప్రాప్తికి మూలాధారం. తన శరీరాన్ని భుజించి,

తన రక్తాన్ని పానం చేసే వారికి ఆయన నిత్యజీవాన్ని ప్రసాదిస్తారు, వారిలోని నిత్యజీవాన్ని సురక్షితంగా కాపాడుతారు. ఈ దిగువభావాలు మనమీ పఠనాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తాయి.

**మొదటిది:** కుమారునికి (క్రీస్తు ప్రభువు) తన తండ్రితో గల వ్యక్తిగతానుబంధమే నిత్యజీవం, ఈ నిత్యజీవాన్నే ప్రభువు (కుమారుడు) తన శరీరాన్ని భుజించి, తన రక్తాన్ని పానం చేసే వారికి ప్రసాదిస్తారు. నిత్యజీవం గురించి తెలుసుకోవడం ముఖ్యంకాదు, నిత్యజీవాన్ని స్వంతం చేసుకోవడం ప్రధానం. నిత్యజీవానికి మూలాధారమైన వారు, యేసుప్రభువు ప్రసాదించినపుడే దానిని స్వీకరించడం స్వంతం చేసుకోవడం సాధ్యం. మరి ప్రభువేమో తన శరీర రక్తాలను భుజించిన వారికి మాత్రమే తాను నిత్యజీవాన్ని ప్రసాదిస్తానని పునరుద్ఘాటిస్తున్నారు.

కనుకనే నిత్యజీవాన్ని పొందాలంటే యేసు శరీరాన్ని భుజించడం యేసు రక్తాన్ని పానం చేయడం తప్పనిసరి (6:53). అందుకే యేసు తన శరీరమును భుజించి తన రక్తమును పానము చేయుమని తన శిష్యులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. అపుడే వారు తన మూలమున జీవించడమంటే ఏమిటో తన ద్వారా తన తండ్రియందు జీవించడమంటే ఏమిటో తెలుసుకోగలుగుతారని చెప్పారు (6:57).

**రెండవది:** ఇక్కడ యేసు తన శరీర రక్తాలను భుజించే వారికి చేకూరే ప్రయోజనాలను గురించి చెబుతున్నారు, అప్పుడు శిష్యులు నిత్య జీవాన్ని పొందగలుగుతారు (6:54), ప్రభువు శిష్యులు పరస్పరం ఒకరిలో ఒకరు జీవించగలుగుతారు 6:56, అంతిమ దినమున వారి శరీరాలు పునరుత్థానం పొందుతాయి (6:54).

**మూడవది:** ఇలా తన శరీరాన్ని భుజించే, తన రక్తాన్ని పానం చేసి నిత్యజీవం పొందే తన శిష్యులకు లభించే ఆధ్యాత్మిక వరాలు ఎలాంటివో ప్రభువుకు తెలుసు కనుకనే తానే పరలోకమునుంచి దిగివచ్చిన జీవాహారమని తెలియజేశారు, తానొసగే జీవాహారం మన్నా భోజనం కంటే శ్రేష్ఠమైనదని అన్నారు. మన్నా భోజనం శారీరకమైన ఆకలిని మాత్రమే తీర్చగలుగుతుంది, కానీ ప్రభువొసగే జీవాహారం భౌతిక రూపంలో ఉన్నప్పటికీ నిత్యజీవం కోసం తపించే ఆధ్యాత్మిక ఆకలిని చల్లార్చుతుంది.

**నాల్గవది:** యూదుల నమ్మకం ప్రకారం రక్తంలో జీవముంటుది, ఆ జీవం దేవునికి చెందినది గనక దేవునికి సమర్పించిన జంతువు రక్తాన్ని పానం చేయడం అపచారం (లేవీ 17:11-14, ద్వితీయో 12:23). ఇలాంటి వేదాంత భావజాలం సాంస్కృతిక నేపథ్యంగల ప్రజల మధ్యనే యేసు తన మాంసాన్ని (శరీరాన్ని) భుజించాలని చెప్పడం

మాత్రమే కాకుండా తన రక్తాన్ని పానం చేయాలని కూడా నిర్భయంగా ఉద్ఘాటించడం చెప్పుకోదగిన విశేషం.

ఆనాటి యూదుల చారిత్రక నేపథ్యమే యేసు తన శరీర రక్తాల జీవాహారం గురించి చేసిన ప్రబోధం చారిత్రకమైనదని నిరూపిస్తుంది, అలాగే తన శరీర రక్తాల దివ్యసంస్కారాన్ని (దివ్యసత్ప్రసాదాన్ని) స్థాపించి తన శ్రీసభకు అందజేయాలన్న ప్రభు నిర్ణయం కూడా చరిత్రాత్మకమైనదేనని రుజువు చేస్తుంది.

**ముగింపు:**

ఆహారం శరీరాన్ని పోషిస్తుంది, శక్తినిస్తుంది, ప్రాణాలు నిలబెడుతుంది, జీవన చర్యలన్నిటినీ సక్రమంగా నిర్వర్తించడానికి తోడ్పడుతుంది. అలాగే మన ఆత్మలను పోషించటానికి ఆధ్యాత్మిక ఆహారం అవసరం. ఆ ఆహారాన్ని క్రీస్తుప్రభువు మనకు ప్రసాదించారు. తన శరీర రక్తాలనే మనకు "జీవాహారం" గా అనుగ్రహించారు.

అయితే భౌతికాహారాన్ని జీర్ణించుకొని శక్తిని పొందడానికి మనకు ఆరోగ్యవంతమైన శరీరం ఎంత అవసరమో, అలాగే క్రీస్తు ప్రభువు ప్రసాదించే "దివ్యసత్ప్రసాదాన్ని" స్వీకరించి ఆధ్యాత్మిక శక్తిని పొందడానికి మన ఆత్మలు ఆరోగ్యంగా ఉండాలి. అంటే పవిత్రంగా ఉండాలి, యోగ్యమైన రీతిలో మనం దివ్యబలిలో పాల్గొనాలి. దివ్యసత్ప్రసాదాన్ని స్వీకరించాలి.

"నేను జీవము నిచ్చుటకును, దానిని సమృద్ధిగ ఇచ్చుటకును వచ్చియున్నాను" (యోహాను 10:10) అని ప్రభువు పలికిన మాట "దివ్యసత్ప్రసాదం" ద్వారా అక్షరాల నెరవేరుతోంది.

# యేసు తిరుహృదయ మహోత్సవము
# 25-06-2017

ద్వితియో 7:6-11 1యోహాను 4:7-16 మత్తయి 11:25-30

## ప్రేమకు ప్రతి ప్రేమ

మనం సాధారణంగా ప్రేయమయుడైన వ్యక్తిని హృదయంగలవానిగా వర్ణిస్తాం. ప్రేమ, దయ, కరుణ సానుభూతి మొదలైన లక్షణాలు వుంటే మంచి హృదయం గలవాడని అందరూ చెప్పుకుంటారు. హృదయం చిత్తవృత్తుల్నిటికీ కేంద్రం. కరుణరసం హృదయాన్నుండి ఉప్పొంగుతుంటుంది. అందుచే హృదయం ప్రేమకు చిహ్నం. అందుకే మన హృదయానికెంతో ప్రాముఖ్యతనిస్తుంటాం. శ్రీసభ గూడ యేసు క్రీస్తు హృదయానికి చాలా ప్రాముఖ్యతనిస్తుంది. ఈ దినం యేసు తిరుహృదయ మహోత్సవాన్ని జరుపుకొంటున్నాం. అనగా యేసు మనలనెంతగా ప్రేమించియున్నాడో, అందుకు మన సమాధానం ఏ విధముగా ఉన్నదో మనం ఈ దినం ప్రత్యేకంగా ధ్యానించాలి. మన సాంఘిక జీవితంలో మంచి హృదయం గలవానిని మనం తప్పకుండా ప్రేమిస్తాం. యేసు క్రీస్తు మనుష్యుడుగా జీవించి, మన పట్ల తన ప్రేమ, దయ, కరుణా రసాలను ఒలికించాడు. అయితే మనం ఆయన్ని మంచి హృదయం గల వానినిగా పరిగణించి, అందుకు తగిన విధంగా ఆయన పట్ల మన ప్రేమను వ్యక్తపరుస్తున్నామా?

## పుట్టు పూర్వోత్తరాలు

శ్రీసభలో యేసు తిరు హృదయం ఎడల బహిరంగమైన భక్తి 17 వ శతాబ్దంలో మార్గరెట్ మేరి అనే కన్యక ద్వారా వ్యాప్తి చెందింది. శ్రీసభ ఆరంభంనుండే సిలువపై యేసుక్రీస్తు ప్రక్కను బల్లెముతో పొడవగా పడిన గాయాన్ని శ్రీసభ పితరులు, దైవశాస్త్ర పారంగతులైన పునీతులు భక్తితో ధ్యానిస్తుండేవారు. ఆ తరువాత మధ్య యుగంలో యేసు తిరుహృదయం యెడల భక్తి ప్రారంభమైనప్పుడు ఆ హృదయానికి ఈటెచే తగిలిన గాయంపట్ల మరింత భక్తిని చూపుతూ వచ్చారు. పునీతులైన బెర్నార్డు, గిట్రూడు, మెక్టిల్ డే ఈ భక్తిని ఇంకా ఎక్కువగా ప్రోత్సహించారు. 17వ శతాబ్ధంలో మార్గరీత మరియమ్మ అనే కన్యకు యేసు మూడుసార్లు ప్రత్యక్షమై తిరుహృదయం యెడల భక్తి యొక్క భావాన్ని విశదీకరించారు. ఫ్రాన్సు దేశంలో పరే మొనియల్ అనే పట్టణంలో ఈ కన్యక ఒక విచిత్రమైన దృశ్యాన్ని గాంచింది. అగ్ని జ్వాలలతో మండుచున్న

యేసు హృదయం, దాని చుట్టూ ఒక ముండ్ల కిరీటం, దానిపైన ఒక సిలువను ఆమె చూచింది. ఆ దృశ్యాన్ని యేసు తన హృదయం వైపు చూపిస్తూ తన హృదయమునెడల భక్తి వ్యాపకము చేయమని ఆమెను ఆదేశించాడు. తత్ఫలితంగా 1765 వ సం॥లో 13వ క్లెమెంత్ పాపుగారు ఈ పండుగను కొన్ని మేత్రాసనాలలో జరిపేటట్లు ఆమోదించారు. ఆ తరువాత తొమ్మిదవ భక్తినాథ పాపుగారు 1856 వ సంవత్సరం, ఆగస్టు 23 వ తేదిన ఈ పండుగను శ్రీసభ యావత్తు గొప్పగా జరిపేటట్లు అధికారపత్రం ద్వారా ఆదేశించారు. ఆపైన పదమూడవ కేసరి పాపుగారు 1889 వ సం॥లో ఈ పండుగను ప్రథమ స్థాయికి చెందిన పండుగగా నియమిస్తూ తమ విశ్వ లేఖ ద్వారా శ్రీసభ యావత్తును తిరుహృదయానికి అంకితం చేశారు.

## మండే హృదయం

ఈ పండుగ యొక్క ముఖ్యఉద్దేశం యేసు మనపట్ల చూపిన ప్రేమను గ్రహించి, తిరిగి ఆయనను తగిన విధంగా ప్రేమించటమే. మన క్రైస్తవ జీవితమంతా దీనిలోనే ఇమిడి ఉన్నది. యేసును మనం తగిన విధంగా ప్రేమించాలంటే, ముందు ఆయన ప్రేమను అర్ధం చేసికోవాలి. పునీత యోహాను గూడ అదే చెబుతున్నారు. "దేవుడు ప్రేమ స్వరూపుడు. ఏ వ్యక్తి ప్రేమమయుడై జీవించునో అతడు దేవుని యందును ఉండును... దేవుడు మనలను మొదట ప్రేమించుట చేతనే మనము ప్రేమింతుము"(యోహాను 4:16-19). పునీత మార్గరీత మరియ గాంచిన దృశ్యంలో యేసు హృదయం అగ్నిజ్వాలతో మండుతుంది. అగ్నిజ్వాలలు ప్రేమకు చిహ్నం. అనగా యేసు హృదయం మానవుల పట్ల ప్రేమాగ్నిచే మండిపోతుంది. యేసు తన బహిరంగ జీవితంలో అట్టి ప్రేమను వ్యక్తపరిచాడు. రోగులను,బాధపడువారిని చూచినప్పుడు ఆయన హృదయం కరిగిపోయింది. : "నిస్సహాయులై బాధలతో క్రుగ్గుచు, కాపరిలేని గొఱ్ఱెలవలె చెదిరియున్న జనసమూహమును చూచి, ఆ కరుణామయుని ప్రేవుల తరుక్కు పోయెను"(మత్తయి 9:36). ఆకలిగొన్న జనసమూహాన్ని జూచి ఆయన ఎంతోజాలిగొన్నాడు : " ఈ జనులు మూడు దినముల నుండి ఇక్కడ ఉన్నారు. వీరికి తినుటకేమియు లేదు. వీరిని జూడ నాకు జాలికలుగుచున్నది. వీరు మార్గ మధ్యమున అలసి సొలసి పడిపోవుదురేమో! వీరిని పస్తుగా పంపివేయుట నాకిష్టము లేదు" (మత్తయి 15:32) అని పలికాడు. లాజరు చనిపోయినప్పుడు అతని సోదరి విలపించుట యేసు గాంచినప్పుడు ఆయన హృదయం ద్రవించింది: "ఆమెయు, ఆమె వెంట వచ్చిన యూదులను విలపించుటను చూచినప్పుడు. యేసు హృదయము ద్రవించెను.... యేసు కంటతడి పెట్టెను..." (యోహాను 11:33-36). తన గొఱ్ఱెల నిమిత్తం తన ప్రాణాన్ని గూడా అర్పించే మంచి మేపరిగా

యేసు తన్నుగూర్చి చెప్పుకొన్నాడు. తాను ప్రేమించిన వారి కొరకై మరణానికి గూడ వెనుదీయని ప్రేమ నిజమైన ప్రేమ. యేసు ప్రేమ అట్టిది. దివ్య ప్రేమ ఆయనయందు మానవరూపంతో వ్యక్తమవుతుంది. ఆయన హృదయం నిజమైన మానవ హృదయం.

## ముండ్ల కిరీటం

పునీత మార్గరీత మరియమ్మ చూసిన దృశ్యంలో మండుచున్న యేసు హృదయం చుట్టూ ముండ్ల కిరీటం ఉన్నదని చెప్పాం. ఆ ముండ్ల కిరీటం హృదయాన్ని ఎప్పుడూ గాయపరుస్తుంది. ఆ ముండ్లకిరీటం మన కృతఘ్నుతకు చిహ్నం; అది మన పాపు జీవితానికి గుర్తు. మనలను అంతగా ప్రేమించిన వ్యక్తిని మనం ప్రేమించే బదులుగా ద్వేషిస్తున్నాము. మన నిర్లక్ష్యం, స్వార్థం, లోభం, దొంగతనం, వ్యభిచారం మొదలైన దుర్గుణాలన్నీ ఆ కిరీటంలోని ముళ్ళు. ప్రేమపూరితమైన ఆ హృదయాన్ని ప్రేమరహితమైన మన దుష్టతలంపులు, క్రియలుగాయపరుస్తున్నాయి. మన అనుదిన జీవితంలో మనం ఎంతగానో ప్రేమించి, మేలు చేసిన వ్యక్తి తిరిగి మనకు కీడుచేస్తే ఎంతో బాధపడతాం. అది మరపురాని బాధ. అనుదినం మనలను వేధించే బాధ. అట్లే యేసు గూడ మనం ఆయనకు చేసే ద్రోహాన్ని గూర్చి బాధపడుతుంటాడు. సిలువపైన వ్రేలాడుచున్న క్రీస్తు హృదయాన్ని సైనికుడు ఈటెతో పొడిచినట్లే మనంగూడ మన దుష్క్రియలతో ఆయన హృదయాన్ని బ్రద్దలు చేస్తున్నాం.

## మన పరిహారం

గాయపరచిన హృదయానికి మనం పరిహారం చెల్లించాలి. ఈ పండుగ సంర్భంలో మనం పరిహారం చేయాలని శ్రీసభ కోరుతుంది. ఈ పండుగ ముఖ్యఉద్దేశం కూడ అదే. అయితే యేసు ఇప్పుడు పునరుత్థానుడై, మహిమాన్వితుడై మన ప్రభువుగా పరలోకంలో ఉన్నాడు గదా! మరి అట్టి ప్రభువుకు మనం పరిహారం ఎలా చెల్లించాలి? మనమధ్య లేనప్పుడు మనం ఆయనకు పరిహారం ఎలా చెల్లించగలం? సిలువపై యేసు ఈటెచే పొడువబడినప్పుడు ఆయన ప్రక్కనుండి వెంటనే నీరు, రక్తము స్రవించాయి. (యోహాను 19:34). నీరు జ్ఞానస్నానానికి చిహ్నం. రక్తం దివ్యసత్ప్రసాదానికి చిహ్నం. ఈ రెండూ శ్రీసభను సూచిస్తున్నాయి. ఆదాము ప్రక్కల నుండి ఏవమ్మ జన్మించినట్లే రెండవ ఆదామైన యేసుక్రీస్తు ప్రక్కనుండి ఇప్పుడు శ్రీసభ ఉద్భవిస్తుంది. శ్రీసభ ద్వారా యేసు మన మధ్య జీవిస్తున్నాడు కనుక, మన పరిహారం శ్రీసభకు అందులోని సభ్యులకు చెల్లించాలి. శ్రీసభలోని సభ్యులకు ముఖ్యంగా బాధపడు వారికి సోదరప్రేమను చూపించటమే యేసుక్రీస్తుకు పరిహారం చెల్లించటం. అట్టి సోదరప్రేమను చూపించటం

వలన మనం యేసును ప్రేమించగలం. మనపట్ల యేసు ప్రేమ వ్యక్తమవుతుంది. యేసు పట్ల మన ప్రేమ మనతోటివారి యెడల చూపించవలసిన సోదర ప్రేమయందు ప్రదర్శితం కావాలి. "ఎవరైనను తాను దేవుని ప్రేమింతునని చెప్పుకొనుచు తన సహోదరుని ద్వేషించినచో అట్టివాడే అసత్యవాది. తనకన్నులారా తాను చూచిన సహోదరుని ప్రేమింపనిచో తాను చూడని దేవుని అతడు ప్రేమింపలేడు. కనుక దేవుని ప్రేమించువాడు, తన సహోదరుని కూడా ప్రేమింపవలెననునదియే క్రీస్తు మన కొసగిన శాశనము" (1 యోహాను 4:20-21).

## మన కుటుంబం

యేసు తిరుహృదయ ప్రేమ ప్రతికుటుంబంలో నెలకొని ఉండాలి. కుటుంబం తిరుహృదయానికి అంకితం చేయబడ్డది. అనగా యేసు ప్రేమకు, ప్రేమపూరితమైన క్రైస్తవ జీవితానికి అంకితం చేయబడ్డది. అనుదినం మనం యేసుపట్ల చూపే ప్రేమను గూర్చి ధ్యానిస్తుండాలి. ఆయనకు తిరిగి తగిన ప్రేమను చూపుతున్నామా లేదా? అని ఆలోచించాలి. అనుదినం మన తప్పులను సరిదిద్దుకొంటూ మన పాపాలకు పరిహారంగా సోదర ప్రేమను పాటిస్తుండాలి. యేసు ప్రేమలో మనకుటుంబం దినదినాభివృద్ధి చెందుతుండాలి. దివ్యసత్ప్రసాదం మన ఆధ్యాత్మిక కుటుంబ భోజనం. అది ప్రేమపూరిత సంస్కారం. అది యేసు ప్రేమలో అభివృద్ధి చెందుతుండాలి. ఆయన ప్రేమాగ్ని మన కుటుంబంలో ఎప్పుడూ మండుతూ, తద్వారా మన హృదయాలు గూడ యేసు తిరుహృదయం వలె రూపొందాలి. "భారముచే అలసి, సొలసియున్న సమస్త జనులారా! నా యొద్దకురండు. మీకు విశ్రాంతి నొసగెదను. నాకాడిని మీరెత్తుకొనుడు. సాధుశీలుడననియు, వినమ్ర హృదయుడననియు మీరు నా నుండి నేర్చుకొనుడు. అప్పుడు మీరు విశ్రాంతి పొందుదురు. ఏలయన., నా కాడి సులువైనది. నా బరువు తేలికైనది" (మత్తయి 11:28-30) అని యేసు ఈ దినం సువార్తా పఠనంలో పలుకుచున్నాడు. ఆయన హృదయాన్నుండి మనం నేర్చుకోవాలి. ఆయన హృదయంలో మనం విశ్రాంతి పొందాలి.

# సమాచారములు

## ఫా. రెడయెల్లి ఎడ్యుకేషనల్ సొసైటి: స్కాలర్‌షిప్పుల పంపిణి

2017 మార్చినెలలో జరిగిన 10వ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులైన కతోలిక బాలబాలికలకు, మార్కులను బట్టి ప్రతి విచారణలోను 5గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1000/- స్కాలర్‌షిప్ బహుకరించుటకు సదరు సొసైటి నిర్ణయించటమైనది.

విచారణ కర్తలు, విద్యార్థి పదవ తరగతి మార్కుల లిస్టు జిరాక్స్, జ్ఞానస్నానపు సర్టిఫికేట్, ఫాదరుగారి కవరింగు లెటర్ జతచేసి విద్యార్థి తండ్రి పూర్తి పోస్టల్ అడ్రస్సుతో రూ. 5/- సంచి కవరును తప్పకపెట్టి ది. 15-07-2017వ తేది లోపల **రెవ.ఫా. మల్లవల్లి బాలస్వామిగారు**, చైర్మెన్, ఆర్.సి,యమ్ చర్చి, గన్నవరం-521101 కు పంపవలెను.

## హనుమాన్‌జంక్షన్ (జ్యోతినగర్) విచారణలోని ఆర్.ఎన్ పాలెం - సేవా కార్యక్రమములు - స్వచ్ఛంద ఉజ్జీవకులు : కత్తుల జోజప్ప

హనుమాన్‌జంక్షన్ (జ్యోతినగర్) విచారణలోని ఆర్.ఎన్ పాలెం గ్రామమునందు 1-05-2017న పునీత కార్మిక జోజప్పగారి పండుగను ఘనముగా జరుపుకున్నాము. ఈ గ్రామ దేవాలయ ఫ్లోరింగ్ కొరకు ఆర్థిక సహాయాన్ని మరియు పునీత జోజప్పగారి స్వరూపమును, యేసు తిరు హృదయ స్వరూపములను కానుకలుగా యిచ్చిరి.

మా విచారణ కర్తలైన గురుశ్రీ పోలిమెట్ల జ్యాకీముగారు నూతన స్వరూపములను ప్రతిష్టించి, పరిశుద్ధ దివ్యబలిపూజలో పునీత జోజప్పగారిని ఉద్దేశించి, అమూల్య సందేశమిచ్చి, హాజరైన ప్రజలందరిని శుభాశీస్సులతో దీవించిరి.

ఈ ఉత్సవమునకు శ్రీబళ్ళా వసంతరావుగారు, టైల్స్ కొరకు రూ.45,000/, శ్రీబళ్ళా జగదీష్ గారు సిమ్మెంట్ కొరకు రూ.5,000/-, శ్రీమాయర వెంకటేశ్వరరావు గారు ఇసుక కొరకు రూ. 5,000/-, శ్రీ సుందదరరావు గారు (ఎ.యస్.ఐ వీరవల్లి) యేసు తిరుహృదయ స్వరూపము నిమిత్తం రూ. 9000,

శ్రీ కత్తుల ప్రవీణకుమార్ గారు (నూజివీడు) పునీత జోజప్పగారి స్వరూపము నిమిత్తం 6,000/-లు విరాళముగా యిచ్చిరి. ఇంకా అనేకమంది దాతలు, మరీ ముఖ్యముగా స్థానిక సంఘస్తులు, స్థానిక ఉపదేశి కత్తుల రంగారావు; తర్ఫీదు పొందిన ఉపదేశి కత్తుల జోజప్ప కృషి సహాయ సహకారములకు విచారణ కర్తలు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సహపంక్తి భోజనముతో పండుగ కార్యక్రమములన్నియు త్రియేకదేవుని కృపతో విజయవంతముగా ముగిశాయి.

## జ్యోతిర్మయి స్వచ్ఛంధ యానిమేటర్లకు విజ్ఞప్తి

వివిధ విచారణల్లో స్వచ్ఛందంగా యానిమేటర్లగా పనిచేసేవారు మీ మీ సంఘాలలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవాకార్యక్రమాలను ప్రతినెలా పాస్టరల్ సెంటర్‌కు తెలియపరచాలి. వాటిని జ్ఞానజ్యోతినందు ప్రచురించుటకు ప్రతినెలా మొదటి వారంలో కార్యక్రమ వివరాలన్నీ ఉత్తరం ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు. - ఫా. దామాల విజయకుమార్, డైరెక్టర్, పాస్టరల్ సెంటర్, కార్మెల్ నగర్, విజయవాడ - 520004

## విచారణ గురువులకు విజ్ఞప్తి

గత సంచికలో మరియు మేత్రాసన న్యూస్‌లెటర్‌లో తమతమ విచారణలలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపదేశుల వివరాలను పంపాలని విచారణ గురువులను కోరడం జరిగింది. కాని చాలామంది దీనికి స్పందించలేదు. మీరు మీ ఉపదేశుల వివరాలను పంపేవరకు మేత్రాసనము నుండి వారికి వచ్చే పారితోషిక విషయంలో జాప్యం జరుగవచ్చు. కావున ఇంకా వివరాలను పంపనటువంటి విచారణ గురువులు దయతో జూన్ 10వ తేది లోపు పంపగలరని విచారణ గురువులకు విజ్ఞప్తి.

**గమనిక:** వాట్స్‌అప్, ఇమెయిల్ ఉపయోగించే ఉపదేశులు వాటి వివరాలను పాస్టరల్ సెంటర్ తెలియపరచగలరు. పాస్టరల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమాలను మీకు ఇమెయిల్ ద్వారా మరియు వాట్స్‌అప్ ద్వారా తెలియపరుచటకు ఇది మంచి అవకాశం కావున వీటిని వాడేవారు త్వరితంగా తెలియపరచగలరు.

# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు

| | | | |
|---|---|---|---|
| జి. ఫ్రాన్సిస్ | తుక్కులూరు | 01-06-1969 | |
| బి. మాణిక్యాలరావు | ఈదులగుడెం | 01-06-1973 | |
| కె. ఆంద్రేయ | నున్న | 01-06-1944 | |
| యమ్. బాబురావు | జంక్షన్ | 01-06-1956 | |
| కె. శౌరి | బోడవాడ | 02-06-1976 | |
| యన్. బాలస్వామి | వుప్పలూరు | 04-06-1954 | |
| పి. బెర్నాడ్ | చనుబండ | 04-06-1955 | |
| వై. రఫాయేలు | కోరుకల్లు | 04-06-1967 | |
| యస్. జోసఫ్ | కంకిపాడు | 04-06-1968 | 9030805042 |
| కె. మ్యారియో | ముసునూరు | 04-06-1974 | |
| కె. మధన్‌మోహన్ | కోరుకొల్లు | 05-06-1979 | |
| జి. బాబురావు | లూర్ధునగర్ | 05-06-1969 | |
| యన్. ఫిలిప్పు | జగ్గయ్యపేట | 06-06-1970 | 9912565470 |
| పి. సద్గుణరావు | మంగినపూడి | 06-06-1972 | |
| కె. కిషోర్ | ఉయ్యూరు | 06-06-1981 | |
| బి. డేవిడ్ | అవినిగడ్డ | 06-06-1976 | |
| జి. శాంతారావు | - | 06-06-1972 | |
| కె. సువిశేషరావు | తుక్కులూరు | 07-06-1969 | |
| కె. విజయబాబు | ముదినేపల్లి | 07-06-1985 | |
| ఎ. పురుషోత్తం | జగ్గయ్యపేట | 07-06-1978 | |
| వి. లూకాస్ | మల్లవల్లి | 08-06-1955 | |
| పి. జోసఫ్ | కొండపల్లి | 08-06-1982 | |
| యమ్. కరుణాకర్ | చిల్లకల్లు | 10-06-1994 | 9441802213 |
| యమ్. యోబురాజు | ఉప్పలూరు | 10-06-1980 | |
| బి. కిషోర్ | కొరుకొల్లు | 10-06-1983 | |
| సి.హెచ్.మరియదాస్ | ముసునూరు | 10-06-1973 | |

| | | | |
|---|---|---|---|
| పి. మరియదాస్ | చిల్లకల్లు | 10-06-1974 | |
| జె. ఇశ్రాయేలు | తుక్కులూరు | 10-06-1973 | |
| యూ. ప్రకాష్‌రావు | వేంట్రప్రగడ | 12-06-1968 | |
| సి. హెచ్. రాంబాబు | నందిగామ | 12-06-1977 | 9963670550 |
| యన్. కీర్తి | నున్న | 12-06-1992 | |
| ఎ. శ్రీధర్ | ముదినేపల్లి | 13-06-1985 | |
| వి. బాలస్వామి | కీసర | 14-06-1977 | |
| జి. యేలీషా | ఉప్పులూరు | 14-06-1962 | |
| బి. సాల్మన్‌రాజు | ఉయ్యూరు | 15-06-1968 | |
| డి. ఫ్రాన్సిస్ | ఉయ్యూరు | 15-06-1965 | |
| కె. లాజరు | అవనిగడ్డ | 15-06-1957 | |
| డి. సుందరరావు | జంక్షన్ | 15-06-1955 | |
| ఇ. సురేష్ | ముదినేపల్లి | 15-06-1974 | |
| జి. అంతోని | భాస్కరరావుపేట | 15-06-1970 | 9177119460 |
| డి. ప్రకాష్‌రావు | బంటుమిల్లి | 15-06-1968 | |
| యమ్. కరుణాకర్ | చిల్లకల్లు | 16-06-1984 | |
| డి. రాజు | అవనిగడ్డ | 16-06-1977 | |
| యమ్. బాలసుందరరావు | కంకిపాడు | 18-06-1950 | 9866473470 |
| యన్. మరియదాస్ | నున్న | 20-06-1965 | |
| యన్. ఆనందరావు | కంకిపాడు | 20-06-1958 | 8886836555 |
| పి. చిన్నప్ప | నూజివీడు | 20-06-1954 | |
| వై. జోసఫ్ | జోజినగర్ | 20-06-1969 | |
| పి. అచ్చయ్య | బంటుమిల్లి | 24-06-1973 | |
| ఎ. చిన్నప్ప | ఆర్.ఆర్ పేట | 24-06-1971 | |
| జి. పీటర్ జాన్ | కంకిపాడు | 30-06-1964 | 8790214969 |